

ఆయా విభాగాల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

హైదర్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి(పార్ట్) వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్లలో సమస్యలు, అభివృద్ధి పనులపై వివేకానందనగర్‌లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉపకమిషనర్లు కృష్ణయ్య, మోహన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం, జలమండలి, టౌన్‌ప్లానింగ్, స్ట్రీట్‌లైట్స్, శానిటేషన్ విభాగాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా అన్ని విభాగాల అధికారులతో కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈ గోవర్దన్, డీఈలు రమేష్, బాలకృష్ణ, ఏఈలు రాజీవ్, శివప్రకాశ్, శ్రావణి, ఆశా, జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్లు ప్రశాంతి, ప్రియాంక, ఝాన్సీ, టౌన్‌ప్లానింగ్, ఏసీపీ రమేష్ పాల్గొన్నారు.

● కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అపూర్వ చౌహాన్‌ను ఎమ్మెల్యే గాంధీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భూగర్భ పైపులైన్ పనుల పరిశీలన

హైదర్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఇండియన్ బ్యాంక్ నుంచి ఎల్లమ్మచెరువు సర్‌ప్లస్ నాలా వద్దకు రెండు కోట్ల నిధులతో చేపడుతున్న భూగర్భ పైపులైన్ పనులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ బుధవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైపులైను నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో మంజీర వాటర్‌పైపులైన్ పగిలిపోయిందని, దానిని బాగు చేసినట్లు తెలిపారు. జయనగర్, శాతవాహననగర్, శుభోదయ కాలనీల వారికి నీటి సరఫరా జరుగుతుందన్నారు. రాజిరెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ సీఐ ముత్తుయాదవ్‌ను సత్కరిస్తున్న డీఎం హరి తదితరులు

ఫతేనగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడుపుతున్న సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కూకట్‌పల్లి ట్రాఫిక్ సీఐ ముత్తుయాదవ్ తెలిపారు. బుధవారం నుంచి ఈనెల 30 వరకు కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో నిర్వహించే ప్రమాదరహిత వారోత్సవాల ప్రారంభానికి ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. సెల్‌ఫోన్‌లు మాట్లాడుతూ వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవుతారన్నారు. చెవుల్లో ఇయర్ ఫోన్లు పెట్టుకుని రోడ్లు దాటొద్దని గుర్తు చేశారు. ట్రాఫిక్ సీఐని కూకట్‌పల్లి డీఎం డి.హరి సత్కరించారు. అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరి, కార్మికులు పాల్గొన్నారు.

హరిహరక్షేత్రం ఆలయ కార్యవర్గం ఎన్నిక

ఫతేనగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ భరత్‌నగర్ హరిహరక్షేత్రం ఆలయ పాలక మండలి నూతన కార్యవర్గం బుధవారం ఎన్నియింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, ఎండోమెంట్ అధికారి విజయభారతి, ఇన్‌స్పెక్టర్ మధు పర్యవేక్షణలో సభ్యులను ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పట్లోళ్ల నాగిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా ఎం.సంతోష్‌కుమార్, సూర్యనారాయణ మూర్తి, వెంకటేశ్‌యాదవ్, రాజు, లక్ష్మీనారాయణ, మణెమ్మ నియమితులయ్యారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, బీ బ్లాక్ అధ్యక్షుడు వేణు, నాయకులు జి.వెంకటేశ్వర్లు, సాదుప్రతాప్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

జేఎన్‌టీయూ నుంచి జీడిమెట్లకు బస్సులు నడపాలి

జీడిమెట్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ జేఎన్‌టీయూ నుంచి జీడిమెట్ల ఇండస్ట్రియల్, కొంపల్లి వరకు కార్మికుల సౌకర్యార్థం బస్సులు నడపాలని బీజేపీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జేకే.శేఖర్‌యాదవ్‌లు జీడిమెట్ల డిపో మేనేజర్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వివిధ పరిశ్రమలలో పని చేయడానికి ప్రతిరోజు వేలాది మంది కార్మికులు వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారని, వారికి సరైన బస్సులు సదుపాయాలు లేక తీవ్రఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, ఎం.ఎ‌స్.వాసు, విజయ్, మాలాశ్రీ, డివిజన్ అధ్యక్షుడు శ్రీరాములు పాల్గొన్నారు.

స్మితసబర్వాల్ వ్యాఖ్యలపై దివ్యాంగుల నిరసన

బాలానగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి స్మితసబర్వాల్ దివ్యాంగులపై చేసిన వ్యాఖ్యలపై అఖిల భారత దివ్యాంగుల వేదిక సభ్యులు నిరసన బుధవారం తెలిపారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం కూకట్‌పల్లి వైజంక్షన్ వద్ద నల్లజెండాలతో తమ నిరసనను వ్యక్తం చేశారు. అఖిల భారత దివ్యాంగుల వేదిక గ్రేటర్ అధ్యక్షుడు జంగిల్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలవేసి నిరసనకు దిగారు. ఐఏఎస్ అధికారిగా బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తున్న ఆమె దివ్యాంగులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అఖిల భారత వికలాంగుల వేదిక అధ్యక్షుడు వేల్పుగొండ వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, నాయకులు ఆనంద్, శేషవలి, మురళి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూదేవిహిల్స్‌లో పేకాటరాయుళ్ల అరెస్ట్

జీడిమెట్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్‌లో పేకాట స్థావరంపై బాలానగర్ జోన్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి 13 మందిని అరెస్ట్ బుధవారం చేశారు. వీరి నుంచి రూ.70,430ల నగదు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా భూదేవిహిల్స్‌లోని ప్లాట్‌నెంబర్ 179లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించి 13 మందిని అదుపులోకి తీసుకుని జగద్గిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

వట్టినాగులపల్లిలో వ్యక్తి దారుణహత్య

రాయదుర్గం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వట్టినాగులపల్లిలో మంగళవారం అర్ధరాత్రి వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం వెలుగుచూసింది. గచ్చిబౌలి ఎస్సై మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యూపీకి చెందిన రాజేష్‌కుమార్(44) కొంతకాలంగా వట్టినాగులపల్లిలో నివాసం ఉంటూ పెయింటింగ్ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తాను ఉంటున్న గదిలో హత్యకు గురయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఉదయం 10 గంటలకు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు నిద్రలో ఉండగా తలపై బలంగా కొట్టిచంపినట్లుగా పోలీసులు తెలిపారు. మృతుడికి తెలిసిన వారే హత్యచేసి ఉంటారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైద్యం వికటించి మహిళ మృతి

నిజాంపేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వైద్యం వికటించి బాచుపల్లి ఎస్ఎల్‌జీ ఆసుపత్రిలో ఓ మహిళ మృతి చెందింది. వరంగల్‌కు చెందిన సరస్వతి అనే మహిళా హెర్నియాతో బాధపడుతోంది. ఈ క్రమంలో వైద్యం కోసం బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చింది. దీంతో పరీక్షలు నిర్వహించిన వైద్యులు సరస్వతికి ల్యాప్రోస్కోపి సర్జరీ చేశారు. ఈ క్రమంలో వైద్యం వికటించడంతో మరో పెద్ద ఆపరేషన్ చేశారు. అనంతరం ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఐతే డాక్టర్ల నిర్లక్ష్యంతోనే సరస్వతి మృతి చెందిందని ఆసుపత్రి యాజమాన్యంపై బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో మృతురాలి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

● ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్ ● వసంతనగర్ సొసైటీ సభ్యుల ఆందోళన



వసంతనగర్‌లో 125 గజాల్లో ఏడు అంతస్తుల భవనం

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా అందరూ కలిసిమెలిసి జీవించే కాలనీలో అక్రమ నిర్మాణదారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తూ ని బంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నారు.

ఐడీపీఎల్ కంపెనీలో పనిచేసే అటెండర్ నుంచి ఎండీ వరకు ఉద్యోగులందరూ కలిసి 1987-1989 మధ్య 90 ఎకరాల్లో మూసాపేట్ సర్కిల్ పరిధిలో వసంతనగర్ ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కోప్లాటు 258 గజాలతో మొత్తం 964 ప్లాట్లతో కాలనీ ఏర్పడింది. కోవిడ్ తర్వాత ఈ కాలనీలో ఇతరులు కూడా ప్లాట్లు కొనుక్కుని కాలనీ కట్టుబాట్లు, జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తూ వ్యాపారం కోసం బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. ఈ విషయమై కాలనీ సొసైటీ అధ్యక్షుడు, డైరెక్టర్లు వార్డు స్థాయి నుంచి జీహెచ్ఎంసీ కమిషనర్ దాకా పలుమార్లు రాతపూర్వకంగా అందజేసినా నామమాత్రంగా స్లాబ్‌లకు చిన్నచిన్న హోల్స్ చేసి, నోటీసులు ఇచ్చామని చెప్పి చేతులు దులుపుకుంటున్నారే తప్పా ఒక్క నిర్మాణాన్ని కూడా పూర్తిగా తొలగించిన దాఖలాలు లేవు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు

జూన్ 28న కేపీహెచ్‌బీ డివిజన్‌లో అభివృద్ధి పనులపై జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావును కాలనీ సొసైటీ అధ్యక్షుడు, డైరెక్టర్లు కలిసి వసంతనగర్‌లో అక్రమ నిర్మాణాలు, ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న డీసీ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీలను ఆదేశించారు. కానీ, వారు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

నివాసం అంటే వసంతనగర్ అనేలా..



నివాసాలకు కేరాఫ్‌గా మా కాలనీ ఉండేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నాం. కాలనీలో వ్యాపార, వాణిజ్య సముదాయాలను అడ్డుకుంటున్నాం. భావితరాలకు నివాసం అంటే వసంతనగర్ అనేలా ఉండాలన్నదే మా లక్ష్యం.

- యర్రా వాగేశ్వరరావు, ఐడీపీఎల్ సొసైటీ అధ్యక్షుడు

ఫిర్యాదు చేశాం.. పరిష్కరించే వారే లేరు!

ఏప్రిల్ 4న అప్పటి జెడ్సీ అభిలాష అభినవ్‌కు, జూన్ 7న సీసీపీ రాజేంద్రప్రసాద్‌నాయక్, జూన్ 12న మళ్లీ కూకట్‌పల్లి జెడ్సీని మరోసారి కలవగా ఆమె టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మల్లేశ్వర్‌ను పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జూన్ 14న కాలనీలో ఏసీపీ పర్యటించి అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశారు. జూలై 5న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలవగా కూకట్‌పల్లి జెడ్సీకి రిఫర్ చేశారు. జూలై 10న, 16న జెడ్సీ అపూర్వ చౌహాన్‌ను కలిశారు. 20న జూలై మూసాపేట్ డీసీకి ప్లాట్ నంబర్లతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాం. మరోసారి ఈనెల 22న జెడ్సీ అపూర్వ చౌహాన్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు అందజేశాం. కానీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

- దండు అనిల్‌కుమార్, ఐడీపీఎల్ సొసైటీ డైరెక్టర్

ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు



కేక్‌కట్ చేస్తున్న కార్పొరేటర్ రోజారంగారావు, కొమిరిశెట్టి సాయిబాబా నేతలు

ఓల్డుబోయినపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్‌లో మాజీ మంత్రి కల్వకుంట్ల రామారావు పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్ ఆధ్వర్యంలో మల్లికార్జున్‌నగర్‌లోని భాగ్యశ్రీ గార్డెన్‌లో వందలాదిగా తరలి వచ్చిన పార్టీ నాయకులు కార్యకర్తల సమక్షంలో పండుగ వాతావరణాన్ని తలపించే రీతిలో వేడుకలు చేశారు. అనంతరం మహిళలకు, మహిళా కార్యకర్తకు చీరలను పంపిణీ చేసి ఓల్డుబోయినపల్లిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌గౌడ్, మక్కల నర్సింగ్‌రావు, సయ్యద్ ఎజాజ్, మేకల హరినాథ్, మన్నె ఉదయ్‌యాదవ్, మల్లేష్ యాదవ్, మిరాజ్, మట్టి శ్రీనివాస్, బుర్రియాదగిరి, లలితగౌడ్, రాజుగౌడ్, దేవేందర్, శశికళ, పద్మ, పద్మలత, స్వరూప, అనురాధ రాజకుమారి కార్యకర్తలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ నర్సింహ్మాయాదవ్‌తో బీఆర్ఎస్ శ్రేణులు

చందానగర్ మున్సిపల్ కార్యాలయం వద్ద..

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చందానగర్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద వివేకానందనగర్ కార్పొరేటర్ రోజారంగారావు, నియోజకవర్గ నాయకులతో కలిసి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. కొమండ్ల శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంయాదవ్, మిద్దెల మల్లారెడ్డి, రవియాదవ్, బీఎస్ఎన్ కిరణ్‌యాదవ్, భాస్కర్‌రావు, హరీష్‌రావు, రాగం జంగయ్యయాదవ్, దారుగుపల్లి నరేష్, అంజమ్మ రాజుముదిరాజ్, అశోక్‌యాదవ్, నారాయణ, రమేష్‌గౌడ్, శ్రీనివాస్, తిరుమల్లేశ్, అనిల్‌సింగ్ పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శిగా ముఖేష్

నిజాంపేట్,జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శిగా ముఖేష్, కార్యదర్శిగా ఎల్లాస్వామి నియామకమయ్యారు. వీరికి ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ నియామక పత్రాలను బుధవారం అందజేశారు. నిజాంపేట్ కార్పొరేషన్‌లో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

గాజులరామారం, జూలై, 24(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం జరిగిందని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎమ్ చంద్రకాంత్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా బడ్జెట్ ఉందని, దేశంలో విద్యను అభివృద్ధి చేస్తే ప్రభుత్వ విధానాలను ఎక్కడ విద్యావంతులు ప్రశ్నిస్తారో అని మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని మరిచిపోయిందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం బడ్జెట్ కేటాయించకపోవడం చూస్తుంటే రాష్ట్రంపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు.

'బీజేపీ ఎంపీలు విఫలమయ్యారు'

భెల్‌కాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నా.. కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులను తేవడంలో పూర్తిగా విఫలమైయ్యారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కనీస నిధులను కేటాయించకపోవడంపై నిరశన వ్యక్తం చేస్తు భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకులు ఆదర్శ్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్, మజీ జడ్పీటీసీలు బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్థావన లేకుండా కేంద్రబడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. ఇద్దరు తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులున్నప్పటికీ తగిన ప్రాధాన్యం లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వెంకటేష్‌గౌడ్, కుమార్ గౌడ్, తొంట అంజయ్య, సత్యనారాయణ, దేవేంద్రాచారి, నర్సింహ, కుత్బుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముమ్మారెడ్డి ప్రేమకుమార్

జనసేన సభ్యత్వ నమోదు

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులో బాలాజీనగర్ డివిజన్ జనసైనికులు ఏర్పాటు చేసిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ బుధవారం ప్రారంభించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో మండలి దయాకర్, కొల్లా శంకర్, సలాది శంకర్, సుంకర సాయి, మోండా వెంకట్, దాసరి వెంకట్, రాము, విస్సు, పులగం సుబ్బు, షణ్ముక, అనిల్, మారుతి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఎదుట కాంట్రాక్టర్ల ఆందోళన



జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గడిచిన 14 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు క్లియర్ కావడం లేదని, గత ప్రభుత్వంతో పాటు ఈ ప్రభుత్వం కూడా తమ సమస్యలను పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కాంట్రాక్టర్లు బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శించి ఆందోళనకు దిగారు. బంగారం తాకట్టుపెట్టి, అప్పులు చేసి నగరంలో దాదాపు రూ.1,500 కోట్ల మేర పనులు చేపట్టామని, ఇప్పటికీ బిల్లులు చెల్లించకపోవడంతో కొంతమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగర అభివృద్ధిలో కీలకంగా ఉన్న తమను ఇప్పుడు గేటు దగ్గర సెక్యూరిటీతో అడ్డుకొని అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల సందర్భంగా చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా రూ.1,500 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు వెంటనే చెల్లించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని, దీని కోసం జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



రోడ్డును ఆక్రమించి గోడ

భరత్‌నగర్ నుంచి ఫతేనగర్ శివాలయం రోడ్డు ప్రజలకు శాపంగా మారింది. ఈ దారిలో రోడ్డు పక్కన ఉన్న టీఎస్ఐఐసీ (తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) స్థలంలో కూకట్‌పల్లి ఐలా (ఇండస్ట్రియల్ ల్యాండ్స్ అథారిటీ) అధికారులు రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేశారు. దీంతో ఈ దారిలో వెళ్లే వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. టీఎస్ఐఐసీ రోడ్డును ఆక్రమించి ఇష్టానుసారంగా వంకరగా ప్రహరీ నిర్మించడంతో అవతలి వైపు నుంచి వచ్చే వాహనదారులు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రహరీని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- ఫతేనగర్, ఆంధ్రజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంసీపీఐ(యు) పొలిట్‌బ్యూరో సభ్యుడు కాటం నాగభూషణం

మియాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్ని చైతన్యం చేసి పోరాడేందుకు కమ్యూనిస్టులు ఏకం కావాలని, లేకపోతే ప్రజలలో మరింత పలుచన పడతామని ఎంసీపీఐ(యు) పొలిట్‌బ్యూరో సభ్యుడు కాటం నాగభూషణం అన్నారు. మియాపూర్ ఎంఏనగర్‌లోని పార్టీ రాష్ట్రకమిటీ సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల కాలంలో అనుసరిస్తున్న పరిపాలన విధానాలను ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నాయని తెలిపారు. బీజేపీ అధికారం కోసం సీట్లు తగ్గిన, పాలనలో గతంకంటే ఎక్కువ ప్రజావ్యతిరేకత విధానాలను చేపట్టిన పరిస్థితిని రాష్ట్రాల హక్కులను హరిస్తున్న తీరును, దేశంలో అట్టడుగు వర్గాలపై పెరిగిన దాడులు అన్ని బీజేపీ మతోన్మాద ఫాసిస్టు దృక్పథం స్పష్టం చేస్తోందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, సుకన్య, వెంకన్న, రెడ్డిహంసారెడ్డి, తుకారాంనాయక్, కుమారస్వామి, మందరవితో పాటు పలువురు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో నేటి నుంచి జేఈ వ్యాక్సిన్ పంపిణీ

గాజులరామారం, జూలై, 24(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని నేటి నుంచి జేఈ (జపనీస్ ఇన్సెఫ్లైటిస్) వ్యాక్సిన్ పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి స్వర్ణలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 సంవత్సరం నుంచి 15 సంవత్సరాల లోపు వారికి ఉచితంగా వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ వ్యాక్సిన్‌ను పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, అంగన్‌వాడీ సెంటర్లు, జెడ్పీహెచ్ఎస్, యూపీఎస్ స్కూల్లో వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. చిన్నారులకు ఈ వ్యాక్సిన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్వర్ణలత తెలిపారు.

బీసీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన టీపీసీసీ నేతలు

బాలానగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ కార్యదర్శి కర్క నాగరాజు తన అనుచరులతో మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఉదయం సంక్షేమ భవన్‌కు వెళ్లి శ్రీకాంత్‌గౌడ్‌కు శాలువ కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ లేబర్ సెల్ అధ్యక్షుడు సప్పిడి భాస్కర్, సదా మహేష్, కర్క మహేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమైన మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం

ఈనెల 27న ప్రారంభించనున్న సీఎం



మురుగు శుద్ధీకరణ కేంద్రం

పేట్‌బషీరాబాద్, జూలై, 24(ఆంధ్రజ్యోతి): మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రంను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి కుత్బుల్లాపూర్, జీడిమెట్ల గ్రామంలోని మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని అధికారులతో పరిశీలించారు. ఈనెల 27న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు అధికారుల తెలుస్తోంది. దీనిలో భాగంగా అధికారులు ఆ ప్రాంతం వద్ద రహదారుల నిర్మాణం పనులు చురుకుగా సాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో నాలాల ద్వారా వచ్చే మురుగునీటిని ఎప్పటికప్పుడు చెరువుల సమీపంలో ఏర్పాటు చేసిన ఎఫ్‌టీపీ కేంద్రాల ద్వారా శుద్ధీకరణ చేసి నీటిని చెరువుల్లోకి వదిలే విధంగా ఈ కేంద్రాన్ని నిర్మించారు. వెన్నెల గడ్డ చెరువు సమీపంలో రూ.23.8 కోట్ల వ్యయంతో 5ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ ఫర్‌డే) సామర్థ్యంతో నిర్మాణం చేపట్టారు. నగరంలో వెలువడుతున్న మురుగునీటి ద్వారా భూగర్భ జలాలు కలుషితానికి తావులేకుండా చేయడంతో పాటు చెరువులో నీటిని ఎప్పటికప్పుడు శుద్ధి చేస్తారు. ఈ కేంద్రం ద్వారా చెరువులోకి వెళ్లే మురుగు నీటిని నేరుగా శుద్ధి చేసి, తిరిగి వాటిని నాలాలు ద్వారా మూసీలో కలిపే విధంగా పనులు పూర్తి చేశారు.